రోడ్డుపై సంత.. తీరదు చింత

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

శాయంపేట : మండల కేంద్రంలో ప్రతి శనివారం జరిగే తైబజార్ (వారాంతపు సంత)తో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మెయిన్ రోడ్డుకిరువైపుల నిర్వహించడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతోందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణ ప్రాంగణం వెనుక భాగంలో గల ఖాళీ స్థలంలో తైబజార్ నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయకపోవడంతో రోడ్డుకిరువైపుల విక్రయాలు జరుపుతున్నారు. ప్రయాణ ప్రాగణం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు రోడ్డుకిరువైపుల దుకాణాలు ఏర్పాటు చేసుకోవడమే కాకుండా అంబేడ్కర్ సెంటర్‌లో నడిరోడ్డుపై విక్రయాలు జరుపుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు సంత నిర్వహిస్తుండడంతో మండల కేంద్రంలోని ప్రజలతో పాటు మాందారిపేట, కొత్తగట్టుసింగారం. జోగంపల్లి, గోవిందాపూర్, పత్తిపాక గ్రామ ప్రజలు కూరగాయలు, పండ్లు కొనుగోలు చేస్తుంటారు. సంత కేవలం నాలుగు గంటలు మాత్రమే కొనసాగుతుండడంతో ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి కూరగాయలు, పండ్లు కొనుగోలు చేస్తుంటారు. దీంతో శాయంపేట సెంటర్ పూర్తిగా రద్దీగా మారుతుంది. వాహనాలు వచ్చినప్పుడు మరింత ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తైబజార్ నిర్వహించే సమయంలో లారీ కింద పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడని, అయినప్పటికీ గ్రామ పంచాయతీ సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. ఏడాదికి లక్ష అరవై వేలకు పైగా ఆదాయం కలిగిన వారాంతపు సంతను ప్రయాణ ప్రాగణం వెనుక గల ఖాళీ స్థలంలోనే కొనసాగేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరారు.



ప్రయాణ ప్రాగణం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా కొనసాగుతున్న అంగడి



రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

ప్రత్యేక స్థలం కేటాయించాలి



మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు రోడ్డుకిరువైపుల సంత నిర్వహించడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చొరువ తీసుకొని సంతకు ప్రత్యేక స్థలం కేటాయించి షెడ్లు ఏర్పాటు చేయాలి. వాహనదారులు ఇబ్బందులు పడకుండా చూడాలి.

- మారెపల్లి సుధాకర్, శాయంపేట

స్థలాన్ని ఏర్పాటు చేస్తాం..

ప్రయాణ ప్రాగణం వెనుకాల వారాంతపు సంత నిర్వహించేందుకు చర్యలు చేపడుతాం. ప్రతి శనివారం ప్రయాణ ప్రాగణం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు రోడ్డుకిరువైపుల కూరగాయాలు, ఇతర వస్తువులను విక్రయించకుండా ప్రయాణ ప్రాగణం వెనుకభాగంలో విక్రయించాలని వ్యాపారులకు సూచిస్తా. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులుకలుగకుండా చర్యలు తీసుకుంటాం.

- రత్నాకర్, పంచాయతీ కార్యదర్శి

క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన బోయిని పైడి తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఈకాప్స్ రైటర్ రతీష్ ఐటీకోర్ సహాయంతో సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రమోద్‌కుమార్ శుక్రవారం బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించారు.

కాపర్‌వైరు చోరీ



ఎల్కతుర్తి : మండలంలోని వీరనారాయణపూర్ గ్రామ శివారులోని కాకతీయ కెనాల్ సమీపంలో ఏర్పాటు చేసిన 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు ఏఈ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. గతంలో సైతం పలు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్లు చోరీ అయినట్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. చోరీ అయిన వైరు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లా సదస్సును జయప్రదం చేయాలి

ఐనవోలు : ఈనెల 28వ తేదీన గొర్రెలు, మేకల పెంపకం దారుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి నల్లబెల్లి చిన్నరాజు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. గొల్ల, కురుమలు అప్పులు తెచ్చుకుని డీడీలు కట్టి రెండు సంవత్సరాలైనా గొర్రెలు అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గొర్రెల పంపిణీకి బదులు నగదు బదిలీ చేస్తామని చెప్పడంతో గొల్ల, కురుమలు కాంగ్రెస్ పార్టీకి ఓటేసినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చి 5 నెలలు దాటినా గొర్రెల పంపిణీ గురించి అధికార పార్టీ మాట్లాడకపోవడం సరికాదని తెలిపారు. జిల్లా సదస్సు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలు అయ్యేలా వత్తిడి తేనున్నట్లు చెప్పారు. హనుమకొండ జేడీ కార్యాలయం, ఎంజీఎం సెంటర్ రెండు చోట్ల సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కిల్లె గోపాల్, ఉడుత రవీందర్, ప్రొఫెసర్లు హాజరుకానున్నట్లు తెలిపారు.

మట్టి అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలి

వర్ధన్నపేట : మండలంలోని ఉప్పరపల్లిలోని ఎల్లమ్మ చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న కాంట్రాక్టర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ఆ చెరువు నుంచి హిటాచీ, జేసీబీ సాయంతో టిప్పర్ల ద్వారా ఇటుక బట్టీలకు మట్టిని తరలించేందుకు శుక్రవారం కాంట్రాక్టర్ యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. మట్టి అక్రమ తరలింపుపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

అసోసియేట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న జవహర్ మామిడాలకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. కళాశాల ఆవరణలో జవహర్‌ను ప్రిన్సిపాల్ జానకి, వివిధ విభాగాల అధిపతులు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జానకి మాట్లాడారు. జవహర్ విద్యుద్వాహక ద్రవంలో కలిపిన నానో పొడర్లను ఉపయోగించి ఎలక్ట్రికల్ డిశ్చార్జ్ మెషినింగ్ ప్రాసెస్‌పై ప్రయోగాత్మక అధ్యయనాలు అంశంపై ప్రొఫెసర్ సీహెచ్.శ్రీధర్‌రెడ్డి, వాగేశ్వరి ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీహెచ్‌డీ పూర్తి చేశారని తెలిపారు.

ఊరెళ్లే ముందు జాగ్రత్త!

కాజీపేట: వేసవి సెలవుల నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలు, పర్యటక ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సుధాకర్ రెడ్డి సూచించారు. కాజీపేట పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సెలవుల నేపథ్యంలో ఇప్పటికే పీఎస్ పరిధిలో పెట్రోలింగ్ ముమ్మరం చేసినట్లు తెలిపారు. కాలనీల్లో అనుమానిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ప్రభుత్వ భూములను సంరక్షించాలి



అధికారులను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ

దామెర : ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కాగితాల శంకర్ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. అనంతరం వైస్ ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని ఊరుగొండ సర్వే నంబర్ 82లో 11 ఎకరాల భూమిని కొంత మంది ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, అనుమతులు ఎలా మంజూరు చేశారో అధికారులు తెలపాలని నిలదీశారు. ఓ వ్యక్తి 70 గజాల భూమికి బదులుగా ప్రస్తుతం 450 గజాల భూమి రిజిస్ట్రేషన్ ఎలా చేసుకుంటాడని ప్రశ్నించారు. దుర్గంపేట్ ఎంపీటీసీ గండు రాము మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహకారంతో మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశామని జెడ్పీటీసీ గరిగె కల్పన అన్నారు. ఎంపీపీ శంకర్ మాట్లాడుతూ... త్వరలో పదవీకాలం ముగియనుందని, ఇదే చివరి సమావేశమని ఐదు సంవత్సరాల పాటు మండల అభివద్ధికి కృషిచేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీలు పోలం కృపాకర్‌రెడ్డి, మానికకిరణ్, సంధ్య అశోక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘సఖి’ సేవలను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి, హరిత

ఐనవోలు : సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలను మహిళలు వినియోగించుకోవాలని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వనమాల కనపర్తి గ్రామంలో వీఓ సభ్యుల సమక్షంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు చట్టాలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. విడిపోయే భార్యాభర్తలకు సఖి సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా సఖి కేంద్రం పని చేస్తుందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు సఖి కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

తిరుగు పయనమైన మత్స్యగిరీశుడు



మండల కేంద్రంలో మత్స్యగిరీశుడి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి ఆలయంలో జరుగుతున్న తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం మచ్చర్లయ్యగుట్ట వద్ద నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలను గజవాహన రథంపై శోభాయాత్ర నిర్వహించారు. మత్స్యగిరి ఆలయానికి తీసుకువచ్చిన ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు జిన్నా ప్రతాప్‌సేనారెడ్డి, కృపాకర్‌రెడ్డి, యూత్ నాయకులు సాదు నాగరాజు, గోపి, భక్తులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై నిరసన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ, ఓయూ, ఇతర ప్రభుత్వ యూనివర్సిటీల్లో చదివిన పట్టభద్రులను పల్లీబఠానీలతో పోల్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్.. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని పట్టభద్రులకు క్షమాపణ చెప్పాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకులు మేడారపు సుధాకర్, తాళ్లపెల్లి నరేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓయూ, కేయూ, ఇతర యూనివర్సిటీల్లో చదివిన వారిలో చాలామంది ఉన్నత స్థానాలకు ఎదిగారని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కేటీఆర్ ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

మానవతారాయ్ వ్యాఖ్యలు సరికావు

కేయూ క్యాంపస్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ నేత మానవతారాయ్ చేసిన వ్యాఖ్యలు సరికావని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పాలాకుల కొమురయ్య, కత్తెరపెల్లి దామోదర్, కేయూ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్ అన్నారు. కేయూలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. యూనివర్సిటీల్లో చదువుకున్న విద్యార్థులను ఉద్దేశించి, వారిని తక్కువచేసి కేటీఆర్ మాట్లాడలేదన్నారు. రాకేష్‌రెడ్డి, తీన్మార్ మల్లన్నల మధ్య వ్యక్తిత్వాన్ని పట్టభద్రులకు తెలిపే క్రమంలోనే బిట్స్ ఫిలానీ, పల్లీబఠానీ అనే మాటలు వాడారని నాయకులు వివరించారు.

ప్రసన్నాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హన్మకొండ అర్బన్: పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమైనట్లు ఆలయ చైర్మన్ బెండల అర్జున్‌రావు తెలిపారు. ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, ఆరుట్ల రామాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, నవగ్రహ మండపారాదన, ఉపచార పూజ, గోత్ర నామార్చన నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో హనుమద్గిరి హనుమాన్ దీక్ష అన్నదాన సేవా సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు గండె కృష్ణ, కె.రవికుమార్, సభ్యులు అంబటి నరేందర్, ఎం.మొగులయ్య, దశరథ, సుధాకర్, హనుమాన్ మాలధారులు పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో సంతోషిమాతకు పూజలు



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయ ఆవరణలో సంతోషిమాత ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు. మహిళలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలోని జ్ఞాన సరస్వతి, అన్నపూర్ణ, గాయత్రీదేవికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలతో పాటు నిత్య పూజలు జరిపించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ దంపతులు గణపతి పూజ, పుణ్యావాహనం, నవగ్రహ పూజ, కలశపూజ, అగ్ని ప్రతిష్ఠాపనలు జరిపించారు. కలశ స్థాపన తర్వాత 21 మంగళ హారతులు పట్టారు. సాయికృష్ణశర్మ పర్యవేక్షణలో నిత్య చండీహోమం ప్రారంభించారు. చండీ పారాయణాన్ని మణికంఠశర్మ ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కమ్యూనిస్టులకు మార్గదర్శకుడు గిరిప్రసాద్

న్యూశాయంపేట: కమ్యూనిస్టులకు మార్గదర్శకుడైన గిరిప్రసాద్ ఆశయాలను కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో గిరిప్రసాద్ 27వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిప్రసాద్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించిన కమ్యూనిస్టు యోధుడు గిరిప్రసాద్ అని కొనియాడారు. ఆయన పోరాటాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాయకులు భిక్షపతి, కర్ణాకర్, ఎల్లేశ్, మునిగాల భిక్షపతి, సారంగపాణి, రాజమౌళి, శంకర్, శ్రీనివాస్, నర్సయ్య, పూర్ణచందర్, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

వికసించిన ‘లిల్లీ’ పుష్పాలు



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన వన ప్రేమికుడు కోమనేని రఘు ఇంటి ఆవరణలోని ప్రకృతివనంలో శుక్రవారం ఉదయం ఒకే రోజు 63 పుట్‌బాల్ లిల్లీ పుష్పాలు వికసించాయి. ఫుట్‌బాల్‌లిల్లీ మొక్కలను (స్కాడొక్సస్ మల్టీ ప్లోరసఖ) అని పిలుస్తారని, పువ్వు పింక్ కలర్‌లో ఉండటమే కాకుండా ఫుట్‌బాల్ ఆకారంలో ఉంటుందని రఘు తెలిపాడు. ఈ మొక్కలను 2003వ సంవత్సరంలో గుజరాత్‌లోని తన మిత్రుడు బహూకరించాడని, అప్పటి నుంచి ప్రకృతివనంలో పెంచుతున్నాని ఆయన తెలిపాడు.

నకిలీ విత్తనాలకు తావివ్వొద్దు



కమలాపూర్ : మాట్లాడుతున్న హరికృష్ణ



ఐనవోలు : మాట్లాడుతున్న ఏఓ కవిత

కమలాపూర్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం నిషేదించిన బీజీ–3 పత్తి విత్తనాలను, నకిలీ, నాసిరకం విత్తనాలను విక్రయిస్తే పీడీయాక్టు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ఏఓ జాలి లక్ష్మారెడ్డితో కలిసి మండలంలోని విత్తన వ్యాపారులు, డీలర్లతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ప్రతి విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులు వారి షాపుల ఎదుట విధిగా లైసెన్సులు, విత్తన, ఎరువులు, పురుగు మందుల రకాలు, స్టాక్ నిల్వలు, ధరల వివరాలు బోర్డుపై ప్రదర్శించాలన్నారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులివ్వాలని, బిల్లుపై విత్తన రకం, విత్తన కంపెనీ పేరు, బ్యాచ్ నంబరు, లాట్ నంబరు, ధర ఉండాలని, బిల్లుపై రైతు సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. గడువు దాటిన లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవాలన్నారు. నాణ్యత లేని, నాసిరకం, నకిలీ విత్తనాలను, వాటి విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ, పోలీస్ శాఖలతో పాటు టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ విభాగాలు పని చేస్తున్నాయన్నారు. ఏఓ జాలి లక్ష్మారెడ్డి, ఏఈఓలు ఎం.సరిత, వినయ్‌వర్మ, రాజు, సరిత, ప్రతాప్, డీలర్లు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని విత్తన షాపుల డీలర్లు చట్టాలకు లోబడి విత్తనాలు విక్రయించాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందించాలని ఏఓ అడప కవిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని విత్తన డీలర్లకు విత్తన చట్టాలపై పోలీస్, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. లైసెన్స్ ఉన్న వారు మాత్రమే విత్తనాలు విక్రయించాలని సూచించారు. స్టాక్ బోర్డు తప్పని సరిగా రాయాలని, ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయించొద్దన్నారు. కాలం ముగిసిన విత్తనాలను రైతులకు ఇవ్వొదన్నారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులు, ప్రతి రోజు స్టాక్ వివరాలు రాయాలన్నారు. నియమాలు అతిక్రమించితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సీఐ ఇస్లావత్ శ్రీనివాస్, ఎస్సై అనిల్‌కుమార్, ఏఈఓలు విశ్వభాను, అనూష, హీన, అఫ్రీన్, సువర్ణ, విత్తన డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

హామీలను మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం



ఓటు అభ్యర్థిస్తున్న గండ్ర జ్యోతి



వేలేరు : మాట్లాడుతున్న రాజయ్య

- జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అన్నారు. మండలంలోని శాయంపేట, పత్తిపాక, గంగిరేణిగూడెం, ప్రగతిసింగారం, కాట్రపల్లి, కొప్పుల, మైలారం గ్రామాల్లో శుక్రవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోరుతూ ఆమె ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇంటికెళ్లి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం మాట్లాడుతూ.. రాకేశ్‌రెడ్డి బిట్స్ పిలానీలో గోల్డ్ మెడల్ సాధించి అమెరికాలోని రెండు కంపెనీల్లో పనిచేసి ప్రజాసేవా చేయాలనే తాపత్రాయంతో అత్యుత్తమ ఉద్యోగాలను వదిలేసి రాజకీయాల్లోకి వచ్చారని అన్నారు. మంచి ఆశయం ఉన్న వ్యక్తులను పెద్దల సభకు పంపించాలనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ టికెట్ ఇచ్చినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చేందుకు నోటికి వచ్చిన మాటలు మాట్లాడారని, అబద్ధాల పునాదులపై అధికారం చేపట్టారని ఆరోపించారు. ఆరు నెలల కాలంలోనే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. ఈనెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలో పట్టభద్రులంతా రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, రమణారెడ్డి, రాజేందర్, కరణ్‌బాబు, రమేష్, మోహన్ పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : సమాజానికి పట్టిన చీడపురుగు తీన్మార్ మల్లన్న అని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య విమర్శించారు. శుక్రవారం మండలంలోని పీచర గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల సన్నాహక సమావేశానికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి హాజరై మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి గెలిచిందని, ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటువేసి మరోసారి మోసపోవద్దని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని నమ్మించి గొంతుకోసిన కడియం శ్రీహరి అధికార దాహంతో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాడని విమర్శించారు. జెడ్పీటీసీ చాడ సరిత, వైస్ ఎంపీపీ సంపత్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగరావు, నాయకులు ఇట్టబోయిన భూపతిరాజు, సూత్రపు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని బీఆర్‌ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పట్టణ ఇన్‌చార్జ్ ఇంగిళి వీరేశ్‌రావు కోరారు. శుక్రవారం పట్టణంలో పలు వార్డుల్లో పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బాపురావు, హమీద్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.


తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

శాయంపేట : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శాయంపేట, ప్రగతిసింగారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల కాలంలో రైతుల సమస్యలను గాలికొదిలేసిందన్నారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కూడా చెల్లించడం లేదని మండిపడ్డారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, తేమ పేరుతో రైతులను ఇబ్బంది గురి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎలాంటి షరతులు లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. యూత్ జిల్లా నాయకులు పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి, బలవంతుల రాజు, ప్రవీణ్, రైతులు అనిల్, అశోక్, నాగరాజు పాల్గొన్నారు.

బీమా డబ్బుల అందజేత



ఐనవోలు : మండలంలోని వెంకటాపురం షిరిడి సాయి పురుషుల పొదుపు సంఘం సభ్యుడైన చింతం ప్రభాకర్, నెల్లుట్ల యాదగిరి, సత్యసాయి పురుషుల పొదుపు సంఘం సభ్యులైన దేవకారి రాజేందర్ ఇటీవల మృతిచెందారు. ఆయా సంఘాల నుంచి మృతులు సాధారణ బీమా కలిగి ఉండటంతో వారి నామినీలకు శుక్రవారం రూ.70 వేల చొప్పున బీమా డబ్బును అందించారు. సమితి అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సంఘాల అధ్యక్షులు వీరస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.